మూసీ బాధితులకు అండగా ఉంటా: శ్రీనివాస్ యాదవ్


మాధవీలత కనిపించడం లేదని పోస్టర్లు ప్రదర్శిస్తున్న గడ్డం శ్రీనివాస్‌యాదవ్

అబిడ్స్: మూసీ సుందరీకరణతో ఇళ్లను కోల్పోయే బాధితులకు తాను అండగా ఉంటానని హైదరాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ కాంటెస్టెడ్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. గోషామహల్ నియోజకవర్గంలోని మూసీ పరీవాహక ప్రాంతాలైన చంద్రకిరణ్ బస్తీ, అంబేద్కర్‌నగర్ బస్తీ, ఉప్పలమ్మ బస్తీ, జుమ్మేరాత్ బజార్ ప్రాంతాల్లో శనివారం ఆయన పర్యటించారు. అనంతరం గడ్డం శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ..ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో పోటీచేసిన బీజేపీ అభ్యర్థి మాధవీలత ఎన్నికల తర్వాత ఒక్కరోజు కూడా ప్రజల ముందుకు రాకపోవడం బాధాకరమన్నారు. మాధవీలత కనిపించడం లేదని పోస్టర్లు ప్రదర్శించారు. బీఆర్ఎస్ పార్టీ ఎన్నికలు ఉన్నా, లేకున్నా ప్రజలకు అండగా ఉంటుందన్నారు. మూసీ ఒడ్డున మూసీ అభివృద్ధితో దాదాపు 2 వేల మంది ఇండ్లు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. వారందరికీ సీఎం రేవంత్‌రెడ్డి దగ్గరకు తీసుకువెళ్లి తగు న్యాయం చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో లోకేష్, సతీష్, రాజు, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


మాట్లాడుతున్న ఏసీపీ శంకర్‌రాజు

అబిడ్స్: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ బేగంపేట ఏసీపీ జి.శంకర్‌రాజు పేర్కొన్నారు. కొంత మంది వాహనదారులు నిర్లక్ష్యంతో వ్యవహరించడం ద్వారనే తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. శనివారం గోషామహల్ పోలీస్ సీటీసీ గోషామహల్ పోలీస్ ట్రైనింగ్ విద్యార్థులకు రోడ్డు భద్రతపై ఆయన అవగాహన కల్పించారు. పవర్ ప్రజంటేషన్ ద్వారా వారికి ట్రాఫిక్‌పై పలు అంశాలు వివరించారు. ఈ సందర్భంగా శంకర్‌రాజు మాట్లాడుతూ..రోడ్డు ప్రమాదాల నివారణ అనేది ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. దాదాపు 150 మంది ట్రైనింగ్ పోలీస్ విద్యార్థులతో పాటు ప్రిన్సిపాల్ ఆనంద్, వైస్ ప్రిన్సిపాల్ విక్రమ్‌దేవ్, నర్సింహమూర్తి, ఆర్.ఎస్.ఐ.కుమార్, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నందిని సిధారెడ్డి తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో రచయిత డాక్టర్ తూర్పు మల్లారెడ్డి రచించిన అన్వేషణ పుస్తకావిష్కరణ సభ శనివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షుడు నందిని సిధారెడ్డి మాట్లాడుతూ..సాహిత్య వ్యాసాలను రాయడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ గ్రేడ్ కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాళేశ్వరం శంకరం, జంట నగరాల శాఖ అధ్యక్షుడు కె.శ్రీరాములు, బెల్లంకొండ సంపత్‌కుమార్, శంకర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి


హకీంపేట్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయిస్తున్నాని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన నానల్‌నగర్ డివిజన్‌లోని హకీంపేట్, హకీంపేట్ కుంట, సాలర్‌బ్రిడ్జి తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. హకీంపేట్ కుంట ప్రవహిస్తున్న బుల్కాపూర్ నాలాలో వ్యర్థాలు పేరుకుపోతున్నాయని ఈ నాలాలో పూడికతీత పనులు చేపట్టాలని తాను అధికారులను కోరడం జరిగిందన్నారు. వర్షాకాలంలో పారిశుధ్య పనులు కుంటుపడకుండా ప్రతినిత్యం చెత్తను తరలించే విధంగా వాహనాలను ఏర్పాటు చేయాలని తాను అధికారులను కోరానన్నారు. నాయకులు ఆలీముద్దీన్, సయ్యద్ జబ్బార్, జహంగీర్ ఆలీబేగ్ తదితరులున్నారు.

కనక దుర్గమ్మ ఆలయ ఈఓను కలిసిన గాజుల అంజయ్య



చార్మినార్: విజయవాడ కనక దుర్గమ్మ అమ్మవారికి ఆదివారం బంగారు పాత్రలో నైవేద్యంతో పాటు పట్టు వస్త్రాలు, వడి బియ్యం సమర్పించనున్నామని..ఇందుకు తగిన ఏర్పాట్లు చేయాలని కోరుతూ భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాలు ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య శనివారం రాత్రి కనకదుర్గమ్మ ఆలయం ఈవో రామారావును కలిసి కోరారు. సప్త మాతృకలకు సప్త బంగారు బోనం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం బ్రాహ్మణ వీధి నుంచి దుర్గ గుడికి సామూహిక బోనాల జాతర ఊరేగింపును నిర్వహించనున్నామని ఆయన ఈవోకు వివరించారు. ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆయనను ఆహ్వానించారు. మధుసూదన్ యాదవ్, కె. ఎస్.ఆనందరావు, కైలాస్ ముదిరాజ్, కోటిరెడ్డి, బి వై శ్రీకాంత్, పాపారావు ఉన్నారు.

విద్యార్థినికి ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

మణికొండ : వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు యాదగిరి పేద విద్యార్థినికి ఆర్థిక సాయం అందించారు. 6వ తరగతి చదువుతున్న అక్షిత కుటుంబ ఆర్థికంగా ఇబ్బదులు ఉండటంతో పాఠశాలకు వెళ్లడం మానేసింది. విషయం తెలుసుకున్న యాదగిరి శనివారం రూ.6 వేలు ఆర్థిక సహాయం అందించారు. తమ సంస్థ ఆధ్వర్యంలో ఇలాంటి సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు తాము ముందుంటామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్, బ్రహ్మానందం పాల్గొన్నారు.

నేడు సామూహిక తొట్టెల సమర్పణ

- బోనాల ఉత్సవాల్లో ప్రధాన ఘట్టం
- లంగర్‌హౌస్ నుంచి సామూహిక తొట్టెల, బోనాల ఊరేగింపు


విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

లంగర్‌హౌస్: గోల్కొండ జగదాంబిక అమ్మవారి ఆషాఢ మాస బోనాలు ఉత్సవాల్లో ప్రధాన ఘట్టం నేడు నిర్వహించనున్నారు. ఆదివారం అమ్మవారికి మూడో పూజ జరపనున్నారు. ఈ సందర్భంగా నగర నలుమూలల నుంచి ప్రధాన ఆలయాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి తొట్టెల, బోనాల సమర్పన చేయనున్నారు. ఈ సామూహిక తొట్టెల సమర్పణ కోసం లంగర్‌హౌస్ వేదిక కానుంది. లంగర్‌హౌస్ చౌరస్తాకు అన్ని తొట్టెలు మధ్యాహ్నం 12 గంటల వరకు చేరుకొని ఇక్కడి నుంచి అన్ని కలిసి సామూహిక ఊరేగింపుగా గోల్కొండకు తరలి వెళ్తారు. అర్ధరాత్రి వరకు ఊరేగింపులో సాగనుండటంలో అరవింద్, చంటిబాబు, శ్రీకాంత్ కలిసి విద్యుత్ శాఖ అధికారులతో నేటి కోసం దారి పొడవునా 450 విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయించారు.

నేడు ట్రాఫిక్ మళ్లింపు..

లంగర్‌హౌస్ నుంచి గోల్కొండ కోటపైకి సామూహిక ఊరేగింపుల సందర్భంగా నేడు లంగర్‌హౌస్ చౌరస్తా నుంచి గోల్కొండ ద్వారం వరకు రోడ్డును సోమవారం తెల్లవారుజాము వరకు పూర్తిగా మూసివేయనున్నారు. గోల్కొండకు వెళ్లే భక్తులకు రాందేవ్ గుడ నుంచి అనుమతిస్తారు. లంగర్‌హౌస్ ఫ్లై ఓవర్ కింద ఇరువైపుల వాహనాల రాకపోకలు నిలిపివేయనున్నట్లు ట్రాఫిక్ పోలీసు అధికారులు తెలిపారు.

అధికారుల సమన్వయంతో పూర్తి ఏర్పాట్లు చేశాం..



నేడు గోల్కొండ జగదాంబిక అమ్మవారు మూడో పూజ అందుకోనున్నారు. ఈ సందర్భంగా నగరంతో పాటు వివిధ జిల్లాల నుంచి తొట్టెలను లంగర్‌హౌస్ నుంచి సామూహిక ఊరేగింపుగా వైభవంగా తీసుకువస్తుంటారు. ఈ బోనాల ఉత్సవాలను కమనీయంగా జరుపుకొనేందుకు లంగర్‌హౌస్ చౌరస్తా నుంచి కోటపై అమ్మవారి ఆలయం వరకు అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పూర్తి ఏర్పాట్లు చేశాం.

– కాంత అరవింద్, గోల్కొండ జగదాంబ బోనాల ఉత్సవ కమిటీ చైర్మన్

డంపింగ్ యార్డుతో ప్రజలకు సుస్తీ

- విజృంభిస్తున్న దోమలు
- పరిసర ప్రాంతాల ప్రజల అవస్థలు
- తరలించాలని స్థానికుల డిమాండ్


డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్త

జియాగూడ: జియాగూడ 100 ఫీట్ల జాతీయ రహదారిలోని చెత్త డంపింగ్ యార్డు కారణంగా డివిజన్ పరిధిలోని ప్రజలకు కంటిమీద కునుకు కరువవుతోంది. తెల్లవార్లు దోమలతో కుస్తీలు పడుతూ వ్యాధుల బారిన పడుతున్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లోని జీహెచ్ఎంసీ స్వచ్ఛ ఆటోలు, లారీల్లో డంపింగ్ యార్డుకు ప్రతిరోజూ వందల టన్నుల్లో చెత్త చేరుతుంది. దీనిని సకాలంలో తరలించడంలో జీహెచ్ఎంసీ సిబ్బంది పూర్తిగా విఫలమైంది. సకాలం మెషీన్లు పనిచేయకపోవడం, చెత్తను తరలించకపోవడంతో చెత్త కుప్పలుగా పేరుకుపోయి దోమలు వృద్ధి చెందుతున్నాయి. జియాగూడ, కార్వాన్ ప్రాంతాల్లో సాయంత్రం వేళల్లో దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు విష జ్వరా, టైఫాయిడ్, మలేరియా, డెంగీ తదితర వ్యాధుల బారిన పడి ఆసుపత్రుల్లో చేరుతున్నారు.

రహదారిలో చెత్తకుప్పలు..

యార్డు పరిసర ప్రాంతాలైన కేశవ స్వామినగర్, న్యూ గంగానగర్, సంజయనగర్, మేకల మండి, గంగపుత్ర నవోదయనగర్, 2జే బస్టాండ్ తదితర ప్రాంతాల రహదారి ఇరు పక్కల ఎక్కడ చూసినా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. దీంతో దోమలు వృద్ధి చెందుతున్నాయని బస్తీల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు డంపింగ్‌యార్డులోని చెత్తను పూర్తిగా తరలించడంతో పాటు రహదారిపై ఉన్న చెత్త కుప్పలను ఎప్పటికప్పుడు తొలగించి రోడ్లను శుభ్రం చే యాలని బస్తీల వాసులు కోరుతున్నారు. డంపింగ్‌యార్డును తరలించాలని కార్వాన్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఉస్మాన్ అలీ, ప్రజాఏక్తా పార్టీ గ్రేటర్ అధ్యక్షులు నర్సింగ్‌రావు డిమాండ్ చేస్తున్నారు.


జాతీయ రహదారిలో దర్శనమిస్తున్న చెత్త కుప్పలు

బోనాల వేడుకలకు రోడ్ల మరమ్మతులు



జియాగూడ: బోనాల పండుగను పురస్కరించుకుని జియాగూడలోని డోర్‌బస్తీ ప్రాంతంలో పాడైన రోడ్లకు బీటీ రోడ్ల మరమ్మతులు చేయిస్తున్నట్లు జియాగూడ డివిజన్ బీజేపీ ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు బగిడి రాహుల్ కుమార్ అన్నారు. ఈ మేరకు శనివారం డోర్‌బస్తీలోని వివిధ ప్రాంతాల్లో ప్యాచ్‌వర్క్ పనులను చేయించారు.

బోనాలకు భారీ బందోబస్తు

గోల్కొండ: గోల్కొండ కోట మూడో బోనం పూజకు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. శనివారం ఆయన గోల్కొండ పోలీస్‌స్టేషన్ వద్ద మూడో బోనం పూజ కోసం తీసుకుంటున్న ఏర్పాట్లపై మాట్లాడారు. మొబైల్ పోలీస్ టీమ్‌లను ఏర్పాటు చేసి భక్తులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కోటకు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గోల్కొండ ఫతేద ర్వాజా, ఆషూర్‌ఖానా, రాందేవ్‌గూడ రోడ్డు, బంజారి దర్వాజ, చోటాబజార్, బడా బజార్, గోల్ఫ్ కోర్టు సమీపంలోని జమాలీ దర్వాజా తదితర ప్రాంతాల్లో పోలీసు క్యాంపులను ఏర్పాటు చేశామన్నారు. అమ్మవారి దర్శనానికి వెళ్లే మహిళల కోసం ప్రత్యేక క్యూలైన్‌ల వద్ద మహిళా పోలీసులను నియమిస్తున్నామని ఆయన అన్నారు.

ప్రత్యేక పూజలు



చార్మినార్: టీఎస్ బసవ కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ నాగనాథ్ మాశెట్టి తదితరులు శనివారం ఇస్కాన్ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం లండన్‌లోని మహాత్మా బసవేశ్వర విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించనున్నామన్నారు.

బోనాల శ్రీనివాస్‌కు సన్మానం

అఫ్జల్‌గంజ్: ప్రముఖ రచయిత కోటిపల్లి సుబ్బారావు రచించిన శకున శాస్త్ర సర్వస్వము శకునాలు వాటి ఫలితాలు గ్రంథావిష్కరణ కార్యక్రమంలో ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు. శనివారం త్యాగరాయ గాన సభలో జరిగిన గ్రంథావిష్కరణ సభలో విశిష్ట అతిథిగా హాజరైన శ్రీనివాస్‌ను త్యాగరాయ గానసభ అధ్యక్షుడు డాక్టర్ కళా జనార్దన మూర్తి, ప్రముఖ జ్యోతిష్యులు సోమంచి సత్యనారాయణ, దానసూర్యనారాయణ, నూనె వెంకటయ్య, టీడీపీ సీనియర్ నాయకుడు కేడీ దినేష్ సన్మానించారు.

అభివృద్ధి పనుల పరిశీలన



యాకుత్‌పురా: బస్తీల్లో గుంతలమయంగా మారిన రోడ్లకు మరమ్మతులు నిర్వహించి నూతన సీవరేజ్ పైప్‌లైన్, సీసీ రోడ్డు పనులను చేపట్టామని యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అన్నారు. శనివారం ఆయన కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్, అధికారులతో కలిసి ఎస్సార్టీ కాలనీ, మౌలా కా ఛీల్లా, ఈస్ట్ చంద్రనగర్, ముర్తుజా నగర్, రెయిన్‌బజార్, మదీనానగర్ ప్రాంతాల్లో పర్యటించి బస్తీలో జరుగుతున్న పనులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజ సమస్యల పరిష్కానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటమన్నారు. నూతన సీసీ రోడ్లు, తాగు నీరు, సీవరేజ్ పనులను చేపట్టామన్నారు.

ఉద్యోగం పేరుతో మహిళను నగరానికి రప్పించి..

చిన్నారి కిడ్నాప్


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ స్నేహ మెహ్రా

చాంద్రాయణగుట్ట: ఓ మహిళనుఉద్యోగం అవకాశం కల్పిస్తామని నమ్మించి నగరానికి చేరుకున్న తర్వాత బాధితురాలి చిన్నారిని కిడ్నాప్ చేసిన నిందితులను శనివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దక్షిణ మండల డీసీపీ స్నేహ మెహ్రా తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లురు జిల్లా బారషాహీద్ దర్గా ప్రాంతానికి చెందిన హబీబున్నీసాతో నగర శివారు ప్రాంతమైన పటాన్ చెరుకు చెందిన నస్రీన్ బేగం (28), నూర్ జహాన్ బేగం (20), మహమ్మద్ అదిల్ (23)లు ఫోన్ ద్వారా పరిచయమయ్యారు. నగరానికి వస్తే ఉద్యోగ అవకాశం కల్పించి అధిక జీతం వచ్చే విధంగా సహకరిస్తామని ఆశలు కల్పించారు. బాధితురాలు నిందితుల మాటలపై విశ్వాసం వ్యక్తంచేయడంతో ముగ్గురు నిందితులు నెల్లురు బారషహీద్ దర్గా ప్రాంతానికి చేరుకుని హబీబున్నీసాను తీసుకుని నగరానికి ప్రయాణమయ్యారు. ఈ నెల 10న ఎంజీబీఎస్‌లో బస్సు దిగిన అనంతరం నిందితులు హబీబున్నీసాను ఉద్యోగం చేసే చోటుకు వెళ్లాలి..సమీపంలోనే ఉన్న వాష్ రూంలో ఫ్రెష్ కావాలని సూచించారు. నిందితుల మాటలను నమ్మిన హబీబున్నీసా తన 6 నెలల చిన్నారిని వారికి అప్పగించి ఫ్రెష్ కావడానికి వెళ్లింది. ఈ సమయం కోసమే ఎదురు చూస్తున్న నిందితులు అక్కడి నుండి జారుకున్నారు. కాలకృత్యాలు తీర్చుకుని వచ్చిన హబీబున్నీసాకు నిందితులు కనిపించక పోవడంతో మోసపోయినట్లు గుర్తించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలను చేపట్టారు. సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు పటాన్ చెరు వైపు వెళ్తున్న బస్సులో ప్రయాణించినట్లు గుర్తించారు. ఆ మార్గంలోని సీసీ కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలించిన పోలీసులు నిందితుల ఆచూకీని కనుగొన్నారు. నిందితుల వద్ద నున్న చిన్నారిని క్షేమంగా రక్షించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నామని డీసీపీ స్నేహ మెహ్రా తెలిపారు.

హనుమాన్ స్ట్రీట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రాజు


రాజును సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: కార్వాన్‌లోని హనుమాన్ స్ట్రీట్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు నూతన అధ్యక్షుడిగా నామని రాజు నియమితులయ్యారు. శనివారం కార్వాన్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నామని రాజును అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నామని రాజు మాట్లాడుతూ.. సిద్ధాంతాలను పాటిస్తూ అసోసియేషన్ కార్యకలాపాలను ముందుకు తీసుకువెళ్తానన్నారు. హనుమాన్ స్ట్రీట్ అసోసియేషన్ అంటే సమాజంలో మంచి గుర్తింపు ఉందన్నారు. ఈ సందర్భంగా నామని రాజును అసోసియేషన్ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముత్యాల భాస్కర్, కురాకుల కృష్ణ, శశిధర్, ప్రేమాచారి, రమేష్‌చారి, వంశీ, శ్రీనివాస్, అమరేందర్, శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

దోమల నివారణపై విద్యార్థులకు అవగాహన



గోల్కొండ: దోమల వ్యాప్తికి అడ్డుకట్ట వేస్తే డెంగీ, మలేరియా లాంటి ప్రమాదకర వ్యాధులను అరికట్టవచ్చునని బల్దియా ఎంటమాలజీ విభాగానికి చెందిన రాజ్‌కుమార్ అన్నారు. శనివారం గోల్కొండ నయాకీలాలోని ఉర్దూ హై స్కూల్‌లో దోమల నిర్మూళన, విష జ్వరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. బల్దియా ఎంటమాలజీ విభాగం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో దోమల నిర్మూళన కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తుందన్నారు. ఇందులో భాగంగా పాఠశాలల్లోని తరగతి గదులు, టాయిలెట్స్, స్టోర్ రూమ్స్ ఈ విధంగా పాఠశాల మూలమూలాని దోమల నివారణ మందులను స్ప్రే చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారికి ప్రశంస పత్రాలు కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు.

అమ్మవారికి పూజలు


పూజల్లో కాంగ్రెస్ నాయకులు కురాకుల కృష్ణ తదితరులు

గోల్కొండ: గోల్కొండ కోట జగదాంబిక మహంకాళి అమ్మవారికి కార్వాన్ కాంగ్రెస్ నాయకులు శనివారం ప్రత్యేక పూజలు చేశా రు. కాంగ్రెస్ ఏ–బ్లాక్ అధ్యక్షుడు కురాకుల కృష్ణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు మహంకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. దేశంలో నిపలు రాష్ట్రాల్లో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా కూటమి అధికారంలోకి రావాలని తాము అమ్మవారిని కోరుకున్నామని కాంగ్రెస్ నాయకులు అన్నారు. రవీందర్, చంటిబాబు తదితరులున్నారు.

డీజీపీ జితేందర్‌కు సన్మానం


డీజీపీని సత్కరిస్తున్న టీఎన్జీఓస్ కేంద్ర సంఘం నాయకులు

అబిడ్స్: డీజీపీ జితేందర్‌ను టీఎన్జీఓస్ కేంద్ర సంఘం నాయకులు ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. నూతన డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన జితేందర్‌కు టీఎన్జీఓస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం. ముజీబ్ హుస్సేన్ సన్మానించి శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డీజీపీ కార్యాలయంతో పాటు అన్ని ప్రాంతాల్లో ఉన్న ఉద్యోగులకు భద్రత పెద్ద ఎత్తున కల్పించి వారికి అన్ని విధాల సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, సెంట్రల్ యూనియన్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్, సిటీ ఆఫ్ హైదరాబాద్ అధ్యక్షుడు శ్రీకాంత్, భాగ్యనగర్ హౌసింగ్ సొసైటీ సభ్యులు మల్లారెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ సమీక్షలో నగర నాయకులు


కార్యక్రమంలో శ్రీనివాస్, ఆనంద్‌కుమార్ గౌడ్, జైను

అబిడ్స్: ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమీక్షలో నగరానికి చెందిన పలువురు కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు. అసోసియేషన్ నగర అధ్యక్షుడు గీసులాల్ జైన్‌తో పాటు నగర కోశాధికారి సీహెచ్. ఆనంద్ కుమార్ గౌడ్ పాల్గొని పలు సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఛాంబర్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. శ్రీనివాస్‌తో కలిసి పలు విధాల సమస్యలపై చర్చించారు. అందరి అభివృద్ధి కోసం ఆకాంక్షించాలని కోరారు.

నేడు 'కోట'లో మూడో పూజ

గోల్కొండ: గోల్కొండ కోటలో నేడు శ్రీ జగదాంబిక మహంకాళి అమ్మవారికి మూడో బోనం పూజ జరుగుతుందని ఆలయ కార్యానిర్వహణ అధికారి ఈ.శ్రీనివాసరాజు అన్నారు. శనివారం ఆయన కోటపై గల ఆలయంలో మూడో బోనం ఏర్పాట్లపై జరుగుతున్న వివరాలను వెల్లడించారు. మూడో బోనం పూజ ఏర్పాట్లపై శుక్రవారం గోల్కొండ కోటలో వివిధ శాఖల ఉన్నతాధికారులు సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఆ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు.

నేడు ట్రాఫిక్ మళ్లింపు..

గోల్కొండ కోటలో నేడు జరిగే మూడో పూజకు గోల్కొండకు హాజరయ్యే వారు తమ సూచనలను పాటించాలని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. రాందేవ్‌గూడ నుంచి మక్కై దర్వాజా, లంగర్‌హౌస్ నుంచి గోల్కొండ కోట, షేక్‌పేట్ నుంచి సెవన్‌టూమ్స్ రోడ్డుగా కోటకు వచ్చే వారు అవసరమైతే తప్ప పై రూట్‌లలో రావద్దని సూచించారు. ఉదయం 8 నుంచి 11 గంటల మధ్య పై రూట్‌లలో వచ్చే వారు ఏవోసీ సెంటర్ ముందు వద్ద గల ఖాళీ ప్రదేశ్ ఆషూర్‌ఖానా వద్ద వాహనాలు నిలిపి నడుచుకుంటూ కోటకు రావాలన్నారు. అదే విధంగా లంగర్‌హౌస్ నుంచి వచ్చే వారు ద్విచక్ర వాహనాలకు అనుమతి ఉండదని ఇటువంటి వారు రాందేవ్‌గూడ మీదుగా ఆషూర్‌ఖానా వద్దకు వచ్చి వాహనాలు పార్కు చేయలని సూచించారు. షేక్‌పేట్ నుంచి బంజారా దర్వాజా మీదుగా వచ్చే వారు ద్విచక్ర వాహనాలను గోల్ఫ్ క్లబ్ పార్కింగ్ ప్రదేశంలో నిలపాలని, ఆటోలు, కార్లు డెక్కన్ పార్కులో పార్కు చేయాలి.

పాతబస్తీలో విద్యుత్ అధికారుల పర్యటన



చార్మినార్: టీజీఎస్పీడీసీఎల్ దక్షిణ మండలం ఎస్ఈ మోహన్‌రెడ్డి సంబంధిత అధికారులతో కలిసి శనివారం పాతబస్తీలో పర్యటించారు. ఆస్మాన్ గడ్ డీఈ హనుమంత్ రెడ్డితో పాటు మరికొంత మంది అధికారులతో కలిసి పాతబస్తీలోని డబీర్‌పురా, బీబీ కా అలావా, చార్మినార్, గుల్జార్‌హౌస్, దారుషిఫా, చాదర్‌ఘాట్ తదితర ప్రాంతాల్లో పర్యటించి విద్యుత్ సరఫరాతో పాటు ఎక్కడైనా ఏవైనా విద్యుత్ సరఫరాలో అంతరాయాలు కలుగుతున్నాయా..అనే విషయాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం మొహర్రం సంతప దినాలు కొనసాగుతున్నందున విద్యుత్ సరఫరాలో ఎక్కడ ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకోవాలని ఎస్ఈ సంబంధిత విద్యుత్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా డబీర్ పురా లోని బీబీ కా అలావా నుంచి నిర్వహించే పదో మొహరం సంతాప దినాల సామూహిక ఊరేగింపును పురస్కరించుకొని ఆయా రూట్ ను పరిశీలించారు. డబీర్‌పురా నుంచి బయలుదేరిన అధికారుల బృందం చార్మినార్, మదీనా చౌరస్తా, దారుషిఫా ద్వారా చాదర్‌ఘాట్ వరకు అధికారులు మొహర్రం రూట్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ పాండే, ఏఈలు భాస్కర్, శీను తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు పిల్లలతో సహా తల్లి అదృశ్యం


షాహీన్ బేగం | మదిహా ఫాతిమా | మహీమ్ ఫాతిమా | సయ్యద్ ఒమర్ హుస్సేన్

అబిడ్స్: ముగ్గురు పిల్లలతో సహా ఓ తల్లి అదృశ్యమైన ఘటన మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ మహేష్‌గౌడ్, ఎస్ఐ షేక్ అస్లామ్ తెలిపిన వివరాల ప్రకారం..నిజామాబాద్‌కు చెందిన షాహీన్ బేగం (34)కు 16 ఏళ్ల క్రితం మంగళ్‌హాట్ గంగాబౌలిలో ఉండే సయ్యద్ కరీమ్‌తో వివాహం జరిగింది. ఆమె గంగాబౌలీలో భర్త, ముగ్గురు పిల్లలతో కలిసి నివసిస్తుంది. ఈనెల 11న మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో 8వ తరగతి చదువుతున్న పెద్ద కూతురు మదిహా ఫాతిమా(12), 6వ తరగతి చదువుతున్న రెండవ కూతురు మహీమ్ ఫాతిమా(11), 3వ తరగతి చదువుతున్న కుమారుడు సయ్యద్ ఒమర్ హుస్సేన్(8)ను వెంట పెట్టుకొని పుట్టింటికని బయలుదేరి వెళ్లింది. భర్తకు అనుమానం వచ్చి నిజామాబాద్‌లో నివసిస్తున్న అత్త, మామకు ఫోన్ చేసి వాకాబు చేయగా షాహీన్ వేగం అక్కడికి రాలేదని తెలిసింది. ఆందోళన చెందిన అతను ఇతర బంధువులు, తెలిసిన వారి ఇళ్లకు ఫోన్లు చేసినా ఎక్కడ కూడా ఆమె ఆచూకి లభించలేదు. అనంతరం మంగళ్‌హాట్ ఠాణాలో భార్య, ముగ్గురు పిల్లలు కనిపించడం లేదని ఫిర్యాదు చేశాడు. ఈ కేసును మంగళ్‌హాట్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.